



వైరల్ ఫీవర్‌లో కొత్త లక్షణాలు

- జిల్లాలో విలవిలలాడుతున్న రోగులు
- కీళ్లు, ఒళ్లు నొప్పులకు మచ్చలు అదనం
- జోరుగా ఆర్ఎంపీల ప్యాకేజీ ట్రీట్మెంట్ దందా

నిర్మల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత నెలన్నర నుంచి జిల్లాను కుదిపేస్తున్న వైరల్ ఫీవర్‌లు రోజుకో కొత్తరూపం దాలుస్తున్నాయి. మొదట డెంగ్యూ, చికెన్‌గున్యా లక్షణాలతో ఈ వైరల్ ఫీవర్స్ జనాన్ని తీవ్ర ఇబ్బందుల పాలు చేయగా ప్రస్తుతం మరో కొత్త లక్షణం ఈ జ్వరాలలో కనిపిస్తుండడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ వైరల్ జ్వరాల కారణంగా తీవ్రమైన ఒళ్లనొప్పులు, కీళ్లనొప్పులతో పాటు ప్లేట్లెట్స్ తగ్గిపోవడం అలాగే బీపీ డౌన్ కావడం, తలతిరిగి పడిపోవడం లాంటి లక్షణాలకు తోడుగా ముక్కుపైన నల్ల మచ్చలు ఏర్పడుతుండడం అందరినీ కలవరపరుస్తోంది. ఇప్పటికే తీవ్రమైన ఒళ్లు, కీళ్లనొప్పులతో బాధపడుతున్న తమకు ముక్కుపై కనిపిస్తున్న నల్లమచ్చలు ఆందోళన కలిగిస్తున్నాయని ఈ మచ్చలు మందులకు తగ్గడం లేదంటున్నారు. ఇక జీవితాంతం ఈ మచ్చలు ఇలాగే ఉండవచ్చన్న ఆందోళన వారిలో వ్యక్తం అవుతుంది. జ్వరంతో బాధపడుతున్న వారిలోనే కాకుండా జ్వరాలు తగ్గిన వారిలో కూడా ప్రస్తుతం ముక్కుపై మచ్చలు పెరిగిపోతున్నాయి. వైరల్ జ్వరాలలో ఇదొక లక్షణంగా మారిపోయిందని అంటున్నారు. అలాగే ఈ వైరల్‌ఫీవర్స్‌తో ఒళ్లు, కాళ్లవాపులు కూడా ఎక్కువవుతున్నాయంటున్నారు. అయితే ముక్కుపై నల్ల మచ్చలకు స్టెరాయిడ్స్ వాడకమే కారణం అంటున్నారు. చాలా మంది ఆర్ఎంపీ డాక్టర్లు జ్వరాలు వెంటనే తగ్గించడం కోసం స్టెరాయిడ్స్ ప్రయోగిస్తున్నారు అన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఒకేసారి రోగులకు ఇంజక్షన్ రూపంలో ఈ స్టెరాయిడ్స్ ఇస్తూ వారి జ్వరాలు వెంటనే తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ స్టెరాయిడ్స్ కారణంతో జ్వరంతో బాధపడుతున్న వారిలో తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తున్నాయి అంటున్నారు. ఇందులో భాగంగానే ముక్కుపై మచ్చలతో పాటు పూర్తిగా బలహీన పడిపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తున్నాయని పేర్కొంటు న్నారు.

ఆర్ఎంపీల ప్యాకేజీ ట్రీట్మెంట్...

కాగా జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న కొన్ని శివారు కాలనీ ప్రాంతాల్లో, అలాగే పట్టణంలోని కొన్ని ముఖ్యవార్డులతో ఖానాపూర్ ప్రాంతంలోని కొంత మంది ఆర్ఎంపీలు ప్రత్యేకంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైరల్ జ్వరాలకు ప్యాకేజీ ట్రీట్మెంట్ అందిస్తుండడం చర్చనీయాంశమవుతోంది. సదరు ఆర్ఎంపీ డాక్టర్లు అధికడోసు గల స్టెరాయిడ్స్, యాంటీ బయాటిక్స్ ఇంజక్షన్లు చేయడమే కాకుండా మొత్తం అవసరమైన మందులను ఈ ప్యాకేజీ ట్రీట్మెంట్‌లో అందిస్తున్నారు. ప్యాకేజీ ట్రీట్మెంట్ కోసం ఒక్కొక్కరి నుంచి 5000ల రూపాయల చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే హైడోస్ స్టెరాయిడ్స్ వాడకం కారణంగా జ్వరం ఒకేసారి తగ్గుముఖం పడుతుండడంతో చాలా మంది రోగులు ఈ ఆర్ఎంపీల వద్దకు పరుగులు తీస్తున్నారు. అయితే ఈ ట్రీట్మెంట్ పొందిన మూడు నాలుగు రోజుల్లోనే మళ్లీ జ్వర లక్షణాలు బయట పడుతున్నట్లు చెబుతున్నారు. ముక్కుపై నల్ల మచ్చలు ఏర్పడుతుండడం రోగి పూర్తిగా డీలా పడిపోవడం లాంటి లక్షణాలు వెలుగు చూస్తున్నాయి. దీంతో పాటు విపరీతమైన జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పులు కూడా పెరిగిపోతున్నాయ ని పేర్కొంటున్నారు.

తగ్గు ముఖం పట్టని జ్వరాలు

గత నెలన్నర నుంచి తీవ్రంగా జనాన్ని ఇబ్బందుల పాలు చేస్తున్న వైరల్ జ్వరాల తీవ్రత మాత్రం ఇప్పటికీ తగ్గడం లేదు. దాదాపు నెల రోజుల నుంచి చాలా మంది కీళ్లు, ఒళ్లు నొప్పులతో ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి తలెత్తుతోంది. జిల్లా కేంద్రంలోని అటు ప్రభుత్వ ఆసుపత్రితో పాటు అన్ని ప్రైవేట్ ఆసుపత్రులలో జ్వరాలతో బాధపడుతున్న వారిసంఖ్య పెరిగిపోతుంది. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలలో కూడా చాలా మంది విద్యార్థులు వైరల్ జ్వరాలకు గురవుతున్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఈ జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. కొంతమంది ప్రైవేట్ డాక్టర్లు మాత్రం ఈ జ్వరాలను తమకు అనుకూలంగా మలుచుకుంటూ రోగులను అన్ని రకాల పరీక్షలు, మందుల పేరిట అడ్డగోలుగా దోచుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్ఎంపీల అవతారమెత్తుతున్న కొందరు వైద్య ఉద్యోగులు

కాగా కొంత మంది వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ బేసిస్‌పై పని చేస్తున్న ఉద్యోగులు ఆ ఉద్యోగాలకు సెలవులు పెట్టి ఆర్ఎంపీల అవతారం ఎత్తుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఖానాపూర్ ప్రాంతంలో సదరు కొంత మంది వైద్య, ఆరోగ్యశాఖలోని ఉద్యోగులు తమ ఉద్యోగానికి సెలవు పెట్టి ఏకంగా ప్రైవేట్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా స్టెరాయిడ్స్‌ను జ్వర రోగులకు ఇంజక్షన్ చేస్తే రోగుల నుండి పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిర్మల్ పట్టణానికి ఆనుకొని ఉన్న సోఫీనగర్ ప్రాంతంలో ఓ ఆర్ఎంపీ డాక్టర్ గత నెల రోజుల నుండి రోగులకు ఇలా స్టెరాయిడ్స్ ట్రీట్మెంట్ చేస్తున్న విషయాన్ని పసిగట్టిన పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకోవడం కూడా చర్చనీయాంశం అవుతుంది.

చికెన్ గున్యా లక్షణమే

ప్రస్తుతం వైరల్ ఫీవర్ బాధితుల్లో ముక్కుపై చిక్ సైన్ (నల్లమచ్చలు) ఏర్పడుతున్నాయి. మొదట్లో ఇది చికెన్ గున్యా బాధితులలో కనిపించేది. ప్రస్తుతం వైరల్ ఫీవర్ బాధితులలో కూడా ఎక్కువగా కనిపిస్తుంది. వైరస్ ముటేషన్ కారణంగా ఇది ఏర్పడుతోంది. చికెన్ గున్యా లక్షణాలున్న వారి రక్త పరీక్షల్లో మాత్రం పాజిటివ్ రిపోర్ట్ రావడం లేదు. దీనిపై ఇక్కడి మెడికల్ కాలేజీ వైద్య బృందం స్టడీ చేస్తోంది. ముక్కుపై వస్తున్న నల్లమచ్చల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. సరైన లోషన్ వాడితే రెండు మూడు నెలల్లో తగ్గిపోతుంది. ప్రస్తుతం వైరల్ ఫీవర్ బాధితులలో ఇది సాధారణంగా మారింది.

డాక్టర్ ప్రశాంత్, హెచ్ఓడీ
గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, నిర్మల్

సీఈఐఆర్ అప్లికేషన్ ఉపయోగించుకోండి : ఎస్పీ



ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 24 : మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్ అప్లికేషన్ ఉపయోగించుకుంటే ఫోన్లు రికవరీ చేసి ఇస్తామని ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. మంగళవారం సీఈఐఆర్ ద్వారా కనుగొన్న 65 ఫోన్లను జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఇప్పటి వరకు 965 ఫోన్లను జిల్లాలోని బాధితులకు అందజేసినట్టు వివరించారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేయిస్తున్న డీపీవో శ్రీనివాస్

దిలావర్‌పూర్, సెప్టెంబరు 24 : సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛత హీసేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాల్వ గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది హెల్త్ చెకప్ చేయించారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులు నిర్వహించాలని డీపీవో సూచించారు. అనంతరం డ్రై డే ట్యూస్డేలో భాగంగా డోర్ టు డోర్ సందర్శించి డ్రై డేపై అవగాహన కల్పించారు. ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశించారు. పాఠశాలలో శానిటేషన్ పనులను పరిశీలించారు. మండల పంచాయతీ అధికారి గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి కిరణ్, ఏఎన్ఎం శోభ, అంగన్‌వాడీ టీచర్ సరిత, కారోబార్ శ్రీనివాస్‌రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్, సెప్టెంబరు 24 : మండలంలోని తల్వేద గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, వివిధ రకాల వ్యాధులతో ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలకు తిరుమల నర్సింగ్ హోమ్ డాక్టర్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో తల్వేద గ్రామంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వైద్యులను వీడీసీ సభ్యులు ఘనంగా శాలువాతో సన్మానించారు.

టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను

కలిసిన ఖానాపూర్ నాయకులు



టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, ఖానాపూర్ నాయకులు

ఖానాపూర్, సెప్టెంబరు 24 : కాంగ్రెస్ పార్టీ నూతన టీపీసీసీ అధ్యక్షులుగా నియమితులైన మహేష్ కుమార్‌గౌడ్‌ను మంగళవారం ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ రాజుర సత్యం, మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కదార్ల గంగ నర్సయ్య, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు తోట సత్యం, మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ ఆకుల వెంకాగౌడ్, నాయకులు పరిమి సురేష్, షబ్బీర్‌పాషా, పోలంపెల్లి సచిన్, గాజుల గంగన్న, తదితరులున్నారు.

ఇథనాల్ పరిశ్రమ వల్ల రైతులకు

ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్

నిర్మల్ అర్బన్, సెప్టెంబరు 24 : ఇథనాల్ పరిశ్రమ వలన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిలావర్‌పూర్ మండల రైతులు, వివిధ గ్రామస్తులు, ఇథనాల్ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రైతుల అభిప్రాయాలు, అనుమానాలు, ప్రశ్నలకు అధికారులు, పరిశ్రమ ప్రతినిధుల నుంచి సమాధానాలు, వివరణలు అడిగి తెలుసుకున్నారు. రైతుల ప్రశ్నలపై శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో దిలావర్‌పూర్ మండలంలోని వివిధ గ్రామస్తులు, రైతులు, వివిధ శాఖల అధికారులు, ఇథనాల్ పరిశ్రమ ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో విద్యార్థులు పాల్గొనాలి : కలెక్టర్

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- ట్రిపుల్ ఐటీలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

బాసర, సెప్టెంబరు, 24 : విద్యార్థులు చదువుతోపాటు సమాజసేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడంపై అభినందించారు. ఇంజనీరింగ్ విద్యార్థి నుండి ఐఏఎస్ అధికారిగా ఎదిగిన తన స్వీయ అనుభవాన్ని తెలిపారు. ట్రిపుల్ ఐటీ ప్రత్యేక విశ్వవిద్యాలయమని దీనికి ఇక్కడి విద్యార్థులే అంబాసిడర్‌లుగా మారాలని పిలుపునిచ్చారు. ఇంజనీరింగ్ డిగ్రీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, బీమా వంటి రంగాల్లో ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం వినూత్న కోర్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని కోరారు. వైస్ చాన్సలర్ వెంకటరమణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్ఎస్ఎస్ విభాగంలో ప్రతిభ గల విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికేట్‌లను అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ట్రిపుల్‌ఐటీలో ఏర్పాటైన వివిధ కమిటీల పనితీరు గురించి సమీక్షించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందించిన హెల్త్ ప్రొఫైల్ యాప్‌ను కలెక్టర్ వీక్షించారు. యాప్‌ను అభివృద్ధి పరిచి జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హస్టళ్లకు అనుసంధించే విధంగా అభివృద్ధి చేయాలని విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.విజయ్‌కుమార్, డా. శ్రావణ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 24 : కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను పరిశీలించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పర్యవేక్షకుడు శ్రీనివాస్‌తో పాటు పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



గోదాం పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

పామ్‌ఆయిల్ తోటలను సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



ప్రదర్శనలు తిలకిస్తున్న ఫైజాన్ అహ్మద్

ముథోల్, సెప్టెంబరు 24 : మండలంలోని తరోడా, న్యూ పిప్రి గ్రామశివారులో మంగళవారం అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఫామ్ ఆయిల్ తోటలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటిన రైతులతో మాట్లాడారు. ఆయిల్ ఫామ్ పెట్టిన రైతులు 4 సంవత్సరాలు అంతర పంటలు వేసుకోవచ్చని, 4 సంవత్సరాల తర్వాత పంట కాపుకు వస్తుందని పేర్కొన్నారు. ఆయిల్‌ఫామ్‌కు రాయితీపై ఇచ్చిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను పరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు రాయితీపై 100 శాతం ఎస్సీ, ఎస్టీ రైతులకు, 90 శాతంపై బీసీ, సన్న చిన్న కారు రైతులకు ఆయిల్ ఫామ్ నాటిన రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయిల్ ఫామ్ పంటను సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. రైతులు పండించిన ఫామ్ ఆయిల్‌ను జిల్లాలోనే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రమణ (డీహెచ్ఎస్‌వో) డివిజన్ హెచ్‌వో జావిద్‌పాషా, ఆయిల్ ఫామ్ కంపెనీ ఏరియా మేనేజర్ ప్రణీత్ కుమార్, ఎంపీడీవో శివకుమార్, ఏపీవో శిరీషరెడ్డి, మండలాల ఆయిల్ ఫామ్ అధికారులు ఎండీ మోహిన్ మియా, ఆడెపు శేఖర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు నైపుణ్యాలు పెంపొందిస్తాయి

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు24 : వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందిస్తాయని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం సోఫీనగర్ బాలికల విద్యాలయంలో నిర్వహిస్తున్న వైజ్ఞానికి ప్రదర్శన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ప్రతిభ గల విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. డీఈవో రవీందర్‌రెడ్డి, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, సైన్స్ అధికారి వినోద్ కుమార్, ప్రిన్సిపాల్ డానియల్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పిడుగు పాటుకు పశువులు మృతి

- రూ. 2,50,000ల విలువ గల రెండు ఎద్దులు, లేగ దూడ దుర్మరణం



మృతి చెందిన రెండు ఎద్దులు, లేగ దూడ

లోకేశ్వరం రూరల్, సెప్టెంబరు 24 : మంగళవారం వేకువ జామున పిడుగు పడడంతో పశువులు మృతి చెందిన సంఘటన లోకేశ్వరం మండలంలో జరిగింది. మండలంలోని రాయపూర్ కాండ్లీ గ్రామానికి చెందిన రైతు మక్కాజి లింగురామ్ ఇంటి ముందు కట్టేసి ఉంచిన పశువులపై మంగళవారం వేకువ జామున 2:30 గంటల ప్రాంతంలో పిడుగు పడగా రెండు ఎద్దులు, ఒక లేగ దూడ మృతి చెందిందని తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.2,50,000ల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. వెంటనే సంఘటన స్థలాన్ని రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాఘవేందర్ సందర్శించి వివరాలు సేకరించారు.

అడెల్లిలో పరిసరాల శుభ్రతపై అవగాహన



పచ్చదనం పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సారంగాపూర్, సెప్టెంబరు 24 : మండలంలో గల అడెల్లిలో పరిసరాల శుభ్రతపై మంగళవారం గ్రామస్థులకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి అవగాహన కల్పించి స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో వీధుల్లో శ్రమదానం చేశారు. ఈ నేపథ్యంలో పరిసరాలన్ని పచ్చదనం పరిశుభ్రతగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం వీధుల్లో పచ్చ దనం పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్వయం సహాయక మహిళలు ఉన్నారు.

వరిలో సన్నరకాలకు తెగుళ్లు



కల్లూర్‌లోపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

కుంటాల, సెప్టెంబరు, 24 : ప్రస్తుతం మండలంలోని అయా గ్రామాలలో సన్నరకం వరి పైరుకు తెగుళ్ల ఆశించాయని డీఏవో అంజిప్రసాద్ తెలిపారు. మండలంలోని కల్లూర్ గ్రామంలో మంగళవారం పలువురు రైతుల వరి, సోయా పంటలను ఏడీఏ వీణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వరిపంటలో పాముపొడ తెగులు, అగ్గి తెగులు ఆశిస్తున్నాయని వీటి నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలి సూచించారు. అతేగాకుండా సోయా పంట కోత దశలో ఉందని రైతులు వర్షం దగ్గిన అనంతరం పంట నూర్పిడి చేస్తే బాగుంటుందని పేర్కొన్నారు. ఈయన వెంట మండల వ్యవసాయ సిబ్బంది తదితరులు ఉన్నారు.





ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

● ప్రియుడి మృతి.. ప్రియురాలి ఆరోగ్య పరిస్థితి విషమం

ఉట్నూర్, సెప్టెంబరు 24: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని కన్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంజిగూడ గ్రామానికి చెందిన ప్రేమికులు ఆత్మహత్యాయత్నం చేయడంతో ప్రియుడు మృతి చెందగా ప్రియురాలు ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఉట్నూర్ ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. కన్నాపూర్ పంచాయతీ పరిధిలోని రాంజీగూడకు చెందిన తుకారం, విజ్జుబాయి దంపతుల కుమారుడు ఆత్రం హనుమంతు (22), నార్నూర్ మండలంలోని బొడ్డిగూడకు చెందిన 17ఏళ్ల యువతిని ప్రేమించాడని, అమ్మాయి తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోక పోవడంతో యువతి ప్రియుడు వెంట రావడంతో ఇరువురు కలిసి హనుమంతు పత్తి చేనులోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారన్నారు. హనుమంతు తల్లివిజ్జుబాయి రాత్రి అవుతున్న ఇంటికి కొడుకు రాక పోవడంతో బంధువులకు సమాచారం అందించి పత్తి చేనులో ఉన్న కొడుకు రాలేదని తెలుపగ వారు వెళ్లి చూడగా ప్రేమికులు ఇరువురు ప్రాణాపాయస్థితిలో పడి ఉండడం గమనించి వెంటనే ఇరువురిని 108 అంబులెన్స్‌లో సోమవారం రాత్రి ఉట్నూర్ ఆసుపత్రికి తీసుకువచ్చారన్నారు. హనుమంతు మృతి చెందగా ప్రియురాలు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించి వైద్యం అంది స్తున్నారని తెలిపారు. మృతుడి తల్లి విజ్జుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోహర్ తెలిపారు.

యూ బిట్ కాయిన్ కేసులో ఉపాధ్యాయుడిని

అదుపులోకి తీసుకున్న పోలీసులు

బోథ్, సెప్టెంబరు 24: నిర్మల్ జిల్లాలో సంచలనం సృష్టించిన బిట్ కాయిన్ కేసు ఆదిలాబాద్ జిల్లానూ తాకింది. బిట్ కాయిన్ వ్యవహారంలో సంబంధం ఉందన్న సంవత్సరంతో మండలంలోని సోనాల గ్రామం నుంచి నిర్మల్ జిల్లా పోలీసులు సోమవారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో ధనుంజయ అనే ఉపాధ్యాయుడిని పట్టుకుని తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో ఈ వ్యవహారం ప్రస్తుతం బోథ్, సోనాల మండలాలను తాకింది. ఆయా మండలాలలో కొంత మంది ఉపాధ్యాయులతో పాటు ప్రైవేట్ వ్యాపారాలు చేసేవారు సైతం ఉన్నట్లు తెలిసింది. కాగా వ్యక్తిని పట్టుకెళ్లినవారు ఎవరనే విషయాన్ని స్థానిక ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా.. స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు తీసుకువెళ్లినట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఏది ఏమైనా ఈ వ్యవహారంలో బోథ్‌కు చెందిన కొంత మంది ఉపాధ్యాయులతో పాటు సోనాల గ్రామానికి చెందిన వారు సైతం ఉండడం సంచలనంగా మారింది.

చికిత్స పొందుతూ ఆశా వర్కర్ మృతి

భోథ్, సెప్టెంబరు 24: మండలంలోని గొల్లపూర్ గ్రామానికి చెందిన ఆశా వర్కర్ తులసి బాయి ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. గత రెండు రోజుల క్రితం విరోచనాల బారిన పడ్డ ఈమె రాత్రిపూట బహిర్భూమికి వెళ్లిందని అయితే సోమవారం ఉదయం శరీరమంతా పొక్కులు రావడంతో బోథ్ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి వైద్యులు సూచన మేరకు ఆదిలాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కు తరలించగా.. చేతికి పొక్కులు రావడంతో సర్జరీ చేశారు. అయితే పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందగా మంగళవారం ఉదయం ఆమె స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి పాము విషం ప్రభావం వల్ల పొక్కులు వచ్చి ఉంటాయని వైద్యులు అనుమానిస్తున్నారు. ఏది ఏమైనా ఆశ వర్కర్ మృతి చెందడంతో తమకు తీరం నష్టం సంభవించిందని ప్రభుత్వం ఆమె కుటుంబానికి అండగా నిలవాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.సరస్వతి కోరారు.

'అక్రమ దుకాణాలను తొలగించాలి'

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 24 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట ఉన్న అక్రమ దుకాణాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎండి ఖమర్ అహ్మద్ వ్యాపారులకు సూచించారు. మంగళవారం రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్‌తో కలిసి రిమ్స్ ప్రధాన ద్వారం ఎదుట పరిసరాలను ఆయన పరిశీలించారు. రిమ్స్ ఆస్పత్రిలో వెళ్లడానికి వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందిగా మారిన ఆక్రమణలు తొలగించకపోతే తామే స్వయంగా తొలగిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 24: జైనూర్ మండలంలోని ఆదివాసీ మహిళపై ఆత్యాచారం, హత్య యత్నం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం ఢిల్లీలోని కమిషన్ కార్యాలయంలో షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్య, సభ్యులు ఉస్సెన్ నాయక్‌కు జన జాతి సురక్ష మంచ్ ప్రాంత సంయోజక్ కాసేట్టి లక్ష్మణ్ వినతిపత్రం అందజేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తొడసం అజయ్ ఉన్నారు.

నాటుసారా విక్రయదారుల బైండోవర్

భోథ్, సెప్టెంబరు 24: మండలంలోని నిగిని, బాబేరా గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులను నాటుసారా తయారీ చేసి విక్రయిస్తుండగా పట్టుకుని తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేయడం జరిగిందని ఎక్సైజ్ సీఐ జల్సికర్ అహ్మద్ తెలిపారు. నిగిని గ్రామానికి చెందిన అనూష బాయ్, సుందరబాయిలతో పాటు బాబేరా గ్రామానికి చెందిన జాదవ్, నాగారావును పట్టుకుని బైండోవర్ చేయడం జరిగిందన్నారు.


పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు

భోథ్, సెప్టెంబరు 24: మండలంలోని కనుగుట్ట గ్రామంలో మంగళవారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పక్క సమాచారంతో పట్టుకుని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై ప్రవీణ్ తెలిపారు. వ్యక్తుల వద్ద 4890 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న వారిని రిమాండ్ చేయడం జరిగిందని ఎస్ఐ వివరించారు.

ఏకలవ్య మోడల్ పాఠశాలలో వైద్య శిబిరం

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 24: మండలంలోని పాటగూడ గ్రామంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో మంగళవారం పిట్ట బొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు.













టీపీసీసీ అధ్యక్షున్ని సన్మానించిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్, నాయకులు

టీపీసీసీ అధ్యక్షుడికి ఘన సన్మానం

ఉట్నూర్, సెప్టెంబరు 24: హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాస గృహాలలో మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు డా.బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ని కలిసి ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డా.దాసండ్ల ప్రభాకర్, సీనియర్ నాయకులు అన్సర్‌అలీ, నిసార్,కొత్తపల్లి మహేందర్, సోషల్ మీడియా ఇన్‌చార్జీ ముబిన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో ఘనంగా ఎన్ఎస్ఎస్ డే

నేరడిగొండ, సెప్టెంబరు 24: నేరడిగొండ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.స్వామి, కళాశాల ప్రిన్సిపాల్ షబానాతర్నం పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ స్వామి మాట్లాడుతూ యువకులు దేశసేవలో ముందుండాలని, చదువుతో పాటు సంస్కారం కూడా నేర్చుకోవాలని అన్నారు. ఈ సేవా పథకం విద్యార్థులకు మంచి నడవడి నేర్పుతుందని, దీని వల్ల సేవా గుణం అలబడుతుందని అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ పథకం నా కోసం కాదు నీ కోసం అన్న స్లోగన్‌తో మొదలు పెట్టి సేవ చేయడానికి విద్యార్థులు ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్‌డే ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యతను ప్రోగ్రాం ఆఫీసర్ చేరాల లక్ష్మణ్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ, శ్రీలత, గణేష్, సుజాత, తిరుపతి, సవిన్, శివ, ప్రసాద్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ అవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా (జాతీయ సేవా పథకం) ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సత్యనరాయణరావు, ప్రభాకర్‌రెడ్డిలను ప్రిన్సిపాల్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఎన్ఎస్ఎస్(జాతీయ సేవా పథకం) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో కళాశాల అధ్యాపకులు సోమేష్, నాగభూషన్, రాజేశ్వర్, మాదవి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని వాగ్దేవి జూనియర్, డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సి.ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఇందులో ప్రోగ్రాం అధికారి బోనగిరి కార్తీక్, దీప, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శంకర్

ఎన్నికల హామీలు నెరవేర్చే వరకు పోరాటం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ● కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుపై సుంకిడిలో ప్రెస్‌మీట్



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, సెప్టెంబరు 24: కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షానా పోరాటం చేస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. మంగళవారం మండలంలోని సుంకిడి గ్రామంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుపై ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుంకిడి మార్కెట్ యార్డు కోసం భూమి కేటాయించి అన్ని ప్రక్రియలు పూర్తి చేసిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కేవలం ఆర్డర్ ఇవ్వడానికి ఏంటి ఇబ్బంది అన్నారు. రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేస్తోందని, వంద రోజుల్లో గ్యారంటీలు అమలు అని దేవుళ్ల మీద ఒట్టు వేసి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి పాపాన్ని కొనితెచ్చారని పలు ఆరోపణలు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి, యువ నాయకులు పిడుగు అభిరామిరెడ్డి, ఉపాధ్యక్షుడు మగిడి ప్రకాష్, మేకల రవికాంత్ యాదవ్, వెంకన్న, సుదర్శన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దేవరావు, ఆశన్న యాదవ్, నరసింహులు, తిరుమలగౌడ్, తుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● **ఆధ్యాత్మిక చింతనతోనే సన్మార్గం**

నేరడిగొండ: ఆధ్యాత్మిక చింతనతోనే సన్మార్గం లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని తన స్వగ్రామం రాజురాలో జగదాంబ దేవి సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బోగ్ బండార కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వెంట మాజీ సర్పంచ్ రమేష్, వసంత్‌రావు, పండరి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

● **బాధిత కుటుంబానికి పరామర్శ**

తలమడుగు: మండలంలోని ఖోడాద్ గ్రామానికి చెందిన ఎల్మా రాకేష్‌రెడ్డి భార్య రుతుజారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్థానిక నివాసంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **కొంచవలి జాతరకు ఎమ్మెల్యే అనిల్**

భీంపూర్ రూరల్: మండలంలోని అర్లి(టి) గ్రామంలో మంగళవారం కొంచవలి జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. సంప్రదాయబద్ధంగా వస్తున్న గట్కాతో అన్నదానం చేశారు. దీనికి భీంపూర్, తాంసి, ఆదిలాబాద్ మండలంలోని ప్రజలతో పాటు మహారాష్ట్ర పరిసర ప్రాంతాలలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి హాజరై పూజలు చేశారు. ప్రతియేటా పొలాల అమావాస్య తర్వాత వచ్చే పౌర్ణమి గడిచిన వెంటనే వచ్చే మంగళవారం ఈ జాతరను నిర్వహించడం ఆనవాయితీ.



ఇచ్చోడ డెయిరీని సందర్శించిన విజయ డెయిరీ మేనేజర్

'పాడి రైతులకు త్వరలోనే బిల్లులు'

ఇచ్చోడ, సెప్టెంబరు 24: ఇచ్చోడలోని విజయ డెయిరి మిల్క్ కూలింగ్ యూనిట్‌ను మంగళవారం విజయ డెయిరీ మేనేజర్ దాసునాయక్ సందర్శించారు. సోమవారం అంబేడ్కర్ కూడలిలో రైతులు నిరసన చేపట్టడంతో ఆయన సందర్శించినట్లు పేర్కొన్నారు. గత 3నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయాని పాడిరైతులకు రూ.6లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. త్వరలోనే రైతుల ఖాతాలో జమచేసేలా చూస్తామన్నారు. డెయిరీకి నాణ్యమైన స్వచ్ఛమైన పాలను పోసి కచ్చితమైన ధరను పొందాలని, నీరు కలపడం వల్ల వెన్న శాతం పడిపోతుందని, దాని వల్ల రైతులే నష్టపోతారన్నారు. రైతులు సహకరించి ఆదాయాన్ని పొందాలన్నారు.

108, 102 అంబులెన్స్‌ల తనిఖీ

ఉట్నూర్, సెప్టెంబరు 24: మండల కేంద్రంలోని జీవీకే ఈఎంఆర్ఐ 108 డివిజన్ ఆఫీస్‌లో ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వామాట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి వచ్చిన క్వాలిటి ఆడిటర్ కిషోర్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ 108, 102 అంబులెన్స్ వాహనాలను తనిఖీ చేసి రికార్డులను వాహణ నిర్వహణ, వైద్య పరికరాల పనితీరును పరిశీలించి వాటి ఉపయోగాల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతికేసు వచ్చిన వెంటనే సిబ్బంది త్వరితగతిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు వైద్య సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు. గిరిజన ప్రాంతాలలో 108, 102 సిబ్బంది సేవలు, వైద్య సహాయం సంతృప్తికరంగా ఉండడంతో ప్రోగ్రాం మేనేజర్ స్వామాట్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రాజశేఖర్, 108, 102 సిబ్బంది శంకర్, దత్తు, గణేష్, రాజశేఖర్, ధరమ్‌సింగ్, ప్రవీణ్‌అంజన్న, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో 108 వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

తనిఖీల్లో భారీగా గంజాయి పట్టివేత

తలమడుగు, సెప్టెంబరు 24: పోలీసుల తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. మంగళవారం సాయం త్రం పోలీసుల తనికీల్లో ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం లక్ష్మీపూర్ అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టు వద్ద తెలంగాణ నుంచి మహారాష్ట్రకు కంటైనర్‌లో భారీ ఎత్తున గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం తలమడుగు పోలీసు స్టేషన్‌కు తరలించారు. కంటైనర్‌లో దాదాపు 9 క్వింటాళ్ల గంజాయి ఉన్నట్లు తెలుస్తుంది. పట్టుకున్న గంజాయి విలువ సుమారుగా రూ.9కోట్ల విలువ ఉటుందని తెలుస్తుంది. ఈ విషయమై తలమడుగు ఎస్సై అంజమ్మను వివరణ కోరగా.. వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. ఎస్పీ ఆదేశాలతోనే వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. కానీ మంగళవారం సాయం త్రం పట్టుకున్న వాహనాన్ని రా త్రి 12 గంటల వరకు విచారణ పేరిట జాప్యం చేయడంపై పలు రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఐవో

తలమడుగు, సెప్టెంబరు 24: ప్రభుత్వ కళాశాలలో వంద శాతం ఉత్తీర్ణ త సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని డీఐవో రవీందర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐవో రవీందర్ మాట్లాడుతూ పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ఇప్పటి నుంచి ప్రణాళిక బద్దంగా కష్టపడి చదువుకోవాలన్నారు. జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయని, దాదాపు 3,500 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. అదేవిధంగా అధ్యాపకులు సమయ పాలన పాటించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన అందించాలన్నారు. ప్రతికళాశాలలో 75 శాతం విద్యార్థుల హాజరు శాతం ఉండాలన్నారు. కాగా ఇటీవల కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు పదవీ విరమణ పొందడంతో ఇంచార్జి ప్రిన్సిపాల్‌గా తాంసి కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌కు బాధ్యతలు ఇవ్వడంతో ఆయనకు తలమడుగు కళాశాలకు సంబంధించిన రిజిష్టర్లు పూర్తి బాధ్యతలు త్రిసభ్య కమిటీ ద్వారా అందజేశారు. అనంతరం తలమడుగు కళాశాలకు సంబంధించిన రిజిష్టర్లను డీఐవో రవీంద్రరావు క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో త్రిసభ్య కమిటీ సభ్యులు, కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాయితీపై బస్ పాస్‌లు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 24: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని దివ్యాంగులకు బస్సు రవాణా సౌర్యంలో 50 శాతం రాయితీపై పాస్‌లు అందించడం ప్రజా సంక్షేమానికి నిదర్శనమని ఇంద్రవెల్లి మేజర్ గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్‌రావు పేర్కొన్నారు. జిల్లా బస్సు డిపో డీఎం కల్పన ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని సమాక చౌరస్తాలోని రాంనగర్ గ్రామంలో ఆర్టీసీ అధికారులు దివ్యాంగులకు 50 శాతం రాయితీపై బస్ పాస్‌లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమానికి అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు పరుస్తూ ప్రజలను ఆదుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా కో ఆర్డినేటర్ ప్రమోద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ముత్యాల సురేష్, డివిజన్ అధ్యక్షుడు సోన్ కాంబ్లే, దేవిదాస్, ఆర్టీసీ కండక్టర్ ప్రకాష్, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

స్మైల్ సొసైటీ సేవలు అభినందనీయం

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 24: స్మైల్ సొసైటీ ద్వారా సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడం అభిందనీయమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. మంగళవారం స్మైల్ సొసైటీ అధ్యక్షులు కేమ శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకొని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 30 మంది యువకులు రక్తదానం చేయగా వారిని రిమ్స్ డైరెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం రోగి సహాయకులకు అన్నదానం చేయడం హర్షణీయమన్నారు. అదేవిధంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మరోవైపు కళావతి బ్లడ్ బ్యాంక్ సెంటర్‌లో సొసైటీ సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు మహమ్మద్ రఫీ, సాయి గౌడ్, కిరణ్, విశాల్, సురేష్, రామకృష్ణ, రాజు, రాకేష్, శశికాంత్, రాహుల్, రాధాకృష్ణ, మోతీలాల్ పాల్గొన్నారు.

భైంసాలో మళ్లీ చైన్ స్నాచింగ్

● బైక్‌పై వచ్చి రెండు చోట్ల చోరీకి స్నాచర్స్ యత్నం ● చికిత్స కోసం ఆసుపత్రికి వెళుతున్న మహిళమెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ ● కిరాణాషాపులో మహిళ మెడలో నుంచి అపహరణకు విఫలయత్నం ● వరుస ఘటనలతో మహిళల బెంబేలు

భైంసా, సెప్టెంబరు 24 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో మళ్లీ చైన్ స్నాచింగ్ ఘటన చోటు చేసుకుంది. గత నెలలో రెండు చైన్‌స్నాచింగ్ ఘటనలు మరిచిపోక ముందే మళ్లీ అదే తరహా ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. మంగళవారం పట్టణ పరిధిలోని రెండు చోట్ల చైన్ స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకున్నాయి. రెండు ఘటనల్లోనూ మహిళల మెడల్లో నుంచి బంగారు గొలుసులను తెంపేందుకు చైన్‌స్నాచర్స్ యత్నించారు. అయితే రెండు చోట్ల బాధిత మహిళలు అప్రమత్తతతో వ్యవహరించి ప్రతిఘటించారు. ఒక చోట జరిగిన ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లకపోగా మరో చోట జరిగిన ఘటనలో రూ.2 లక్షలకు పైగా విలువచేసే బంగారు గొలుసులు అపహరణకు గురయ్యాయి. స్థానిక రాహుల్‌నగర్ కాలనీ పరిధిలోని ఒక కిరాణాషాపు నిర్వహిస్తున్న మహిళ వద్దకు చైన్ స్నాచర్స్ ఇద్దరు బైక్‌పై వచ్చి సిగరెట్లు కొనేందుకు వచ్చి చోరీకి విఫలయత్నం చెందారు. ఒకరు బైక్ పై ఉండగా మరొకరు కిరాణషాపు మహిళలకు సిగరెట్లు కావాలని రూ.500 నోటు అందించారు. దీంతో సదరు మహిళ సిగరెట్లు ఇచ్చే క్రమంలో చైన్ స్నాచర్ ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు తెంపేందుకు యత్నించారు. అప్రమత్తమైన మహిళలు బంగారు గొలుసు తెగిపోకుండా గట్టిగా పట్టుకొని దొంగ దొంగ అంటూ కేకలు వేసింది. దీంతో చైన్ స్నాచర్స్ వాయువేగంతో అక్కడి నుంచి బైక్‌పై పారిపోయారు. అనంతరం ఆర్‌డీవో కార్యాలయం రూట్‌లో వచ్చిన చైన్‌స్నాచర్స్ మరోమారు చోరీకి పాల్పడ్డారు. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో అద్దెకుంటున్న రిటైర్డ్ ఆర్మీ జవాన్ సతీమణి మంజుల జ్వరంతో బాధపడుతూ వైద్యం కోసం ఆర్‌డీవో కార్యాలయం మార్గంలో నడుచుకుంటూ ఆసుపత్రికి వెలుతోంది. ఇదే సమయంలో సంబంధిత రూట్‌కు వచ్చిన చైన్‌స్నాచర్ ఒకరు ముందు భాగంలో బైక్‌ను స్టార్ట్ చేసుకొని ఉండగా ఆసుపత్రికి వెలుతున్న మంజుల వెనుకవైపు నుంచి నడుచుకుంటూ వచ్చిన మరో చైన్‌స్నాచర్ ఆమె మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసును తెంపుకొని ఉడాయించేందుకు యత్నించాడు. దీంతో సదరు మహిళ ప్రతిఘటించగా చైన్‌స్నాచర్ ఆమెను తోసేసి పరుగున బైక్ వద్దకు చేరుకుని పారిపోయారు. చైన్‌స్నాచర్ తోసివేయడంతో మంజుల కింద పడిపోగా గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అక్కడకు చేరుకొని బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో పుటేజీని పరిశీలించి చైన్‌స్నాచర్స్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు మంజుల



బైక్‌పై పారిపోతున్న చైన్ స్నాచర్స్

● **రెండు నెలల వ్యవధిలో ఐదు ఘటనలు**

పట్టణ పరిధిలో తొలుత గత నెల 8వ తేదీన చైన్ స్నాచింగ్ ఘటన చోటు చేసుకుంది. స్థానిక రాహుల్‌నగర్ కాలనీ పరిధిలో బి.లక్ష్మి అనే మహిళ స్థానిక నిర్మల్ క్రాస్ రోడ్డు మార్గంలోని శివాజీచౌక్ నుంచి ఇంటికి వెళ్తుండగా స్నాచింగ్ బారిన పడింది. నిర్మల్ నుంచి వచ్చిన సదరు మహిళ శివాజీచౌక్ వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా ... పల్సర్ బైక్ పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు తెంపుకొని ఉడాయించారు. 29న రెండు చైన్‌స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకున్నాయి. స్థానిక జుల్ఫేకర్ గల్లిలో ఉదయం రాణి అనే మహిళ బీడీ కంపెనీకి నడుచుకుంటూ వెలుతుండగా వెనుకవైపు నుంచి బైక్ పై వచ్చిన ఇద్దరు చైన్ స్నాచర్స్ ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కునేందుకు యత్నించారు. అప్రమత్తమైన మహిళ బంగారు గొలుసు తెగిపోకుండా గట్టిగా అదిమి పట్టుకుని దొంగ దొంగ అంటూ అరిచింది. దీంతో చోరీకి విఫలయత్నం చేసిన చైన్‌స్నాచర్స్ ఘటన స్థలి నుంచి బైక్‌పై వేగంగా పారిపోయారు. అక్కడి నుంచి పారిపోయిన చైన్‌స్నాచర్స్ స్థానిక కమలా థియేటర్ సమీపంలో మరో ఘటనకు పాల్పడ్డారు. స్థానిక గోకుల్‌నగర్ కాలనీ పరిధిలో అద్దెకు ఉంటున్న రజతి అనే యువతి కమలా థియేటర్ రోడ్డు మార్గంలో నడుచుకుంటూ వెలుతుండగా వెనుకవైపు నుంచి బైక్ పై వచ్చిన స్నాచర్స్ యువతి మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసు, మరో తులం బంగారుచైన్‌ను తెంపుకునేందుకు యత్నించారు. దీంతో యువతి అప్రమత్తమై ప్రతిఘటించింది. బంగారు గొలుసులు తెగిపోకుండా గట్టిగా పట్టుకుంది. అప్పటికే రెండు గొలుసులు తెగిపోగా పుస్తెలతాడుతో కూడిన బంగారు గొలుసు అర్ధభాగం, మరో బంగారు గొలుసు పూర్తి భాగం చైన్‌స్నాచర్ చేతికి చిక్కగా వారు వాటిని అందుకొని అక్కడి నుంచి బైక్ పై వేగంగా పారిపోయారు. ఈ మూడు ఘటనలు మరిచిపోకముందు మంగళవారం రెండు చైన్ స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకున్నాయి. వరుస చైన్ స్నాచింగ్ ఘటనలతో మహిళలు ఇళ్లలో నుంచి బంగారు ఆభరణాలు ధరించి బయటకు రావాలంటే బెంబేలెత్తిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.



సభ్యత్వ సేకరణలో పాల్గొన్న అంజుకుమార్‌రెడ్డి

ప్రతీ పోలింగ్ బూత్‌లో 200మంది సభ్యత్వ లక్ష్యం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 24 : జిల్లాలోని ప్రతి పోలింగ్ బూత్‌లో కనీసం రెండు వందల మందికి సభ్యత్వం కల్పించేలా లక్ష్యాన్ని నిర్ధారించుకోవాలి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కే.అంజుకుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం 10వ వార్డులో ఇంటింటి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. సభ్యత్వ సేకరణలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు ఎన్. భూపతి రెడ్డి, ఆనంద్, శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పోషకాహారం అమృతం లాంటిది

లక్ష్మణచాంద, సెప్టెంబరు 24 : పోషకాహారం అమృతం లాంటిదని ఎంపీడీవో రాధా రాథోడ్ అన్నారు. మండలంలోని బోరిగాం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 'పోషణ్ అభియాన్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పోషక విలువలు గల ఆహార పదార్థాల గురించి వివరించారు. చిన్నారులందరికీ క్రమం తప్పకుండా పోషకాహారం అందిస్తే మానసిక, శారీరక ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఈవోపీఆర్‌డీ అజీజ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి జంగం మమత, స్థానిక అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

పంటరుణాలు తీసుకుని బీమా చేసుకోవాలి

భైంసా,సెప్టెంబరు 24 : బ్యాంక్‌ల నుంచి పంట రుణాలు తీసుకునే సమయంలో రైతాంగం బీమా చేసుకోవాలని మిర్జాపూర్ ప్యాక్స్ చైర్మెన్ అమెడ దేవేందర్ రెడ్డి సూచించారు. ప్యాక్స్ బీమా చేయించుకున్న ఎం. ప్రభాకర్ అనే రైతు గుండెపోటు బారిన పడి మృతి చెందడంతో మంగళవారం బీమా కంపెనీ నుంచి వచ్చిన రూ.2 లక్షల చెక్కును కుటుంబీకులకు అందచేశారు. ఈ సందర్భంగా మిర్జాపూర్ ప్యాక్స్ చైర్మెన్ అమెడ దేవేందర్ రెడ్డి రైతాంగం పంట రుణాలు తీసుకునే తప్పనిసరిగా బీమా చేసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. బీమా చేసుకుంటే దీమాగా ఉండవచ్చునని పెర్కొన్నారు. ఇందులో ప్యాక్స్ డైరెక్టర్లు వడ్నప శ్రీనివాస్, కె. సాయినాథ్, శ్రీనివాస్ , చంద్రకాంత్ రెడ్డి, బ్యాంక్ సూపర్‌వైజర్ అభిలాష్ గౌడ్, సెక్రటరీ రాజేందర్‌తో పాటు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తానూర్ జూనియర్ కళాశాలలో తనిఖీలు

తానూర్ , సెప్టెంబరు 24 : మండల కేంద్రం తానూర్‌లోని జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్ మాధ్యమిక విద్యాధికారి పరుశురాం ఆకస్మికంగా పరిశీలించారు. సందర్భంగా కాలేజీలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సిలబస్ గుర్తంచి అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ప్రిన్సిపాల్ ఫణి రాజశేఖర్, నరేష్, లక్ష్మణ్, రాజేందర్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ

ముథోల్, సెప్టెంబరు 24 : మండల కేంద్రమైన ముథోల్‌లోని రబింద్ర ఉన్నత పాఠశాలకు చెందిన పి.హాసిని, ఆదిభ తస్లిమాలు నిర్మల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో వైజ్ఞానానికి ప్రదర్శనలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాలో రెండవ స్థానంలో నిలిచినట్లు రబింద్ర పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ తెలిపారు. వీరికి నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్ రెడ్డిలు విద్యార్థులను అభినందించారు. వీరి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్లు సాయినాథ్, రాజేం

ఖాతాదారులకు రుణాలు అందించడంలో ఖానాపూర్ టీజీబీ శాఖ పనితీరు భేష్

● తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వైస్ చైర్మన్ శోభ
● నూతన భవనంలో బ్యాంక్ సేవలు ప్రారంభం



ఖానాపూర్, సెప్టెంబరు 24 : ఖాతాదారులకు రుణాలు అందించడంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖానాపూర్ శాఖ పనితీరు బేష్ అని ఆ బ్యాంక్ చైర్మన్ వైస్ శోభ కొనియాడారు. మంగళవారం ఖానా పూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు బ్యాంక్ సేవలు అందిస్తున్న భవనం నుంచి నూతన భవనంలోకి బ్యాంక్‌ను మార్చడంతో ఆ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... టీజీబీ శాఖ ద్వారా 97 శాతం మంది రైతు లకు రుణాలు అందించామన్నారు. వీటితో పాటు చేపల పెంపకం యూనిట్లు, పీఎంజీఎస్‌వై, ముద్ర, డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు చేశామన్నారు. బ్యాంక్ ద్వారా రుణాలు పొందిన యువకులు, మహిళలు, వ్యాపారులు అభివృద్ధి సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ప్రతీ ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణను పాటించడం ద్వారా అందరి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. టీజీబీ రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు, ఎల్‌డీఎంబీ రామ్‌గోపాల్, మేనేజర్ అశోక్ సీనియర్ మేనేజర్లు విలాస్ అభినయ్, కొత్త శ్రీనివాస్, బ్యాంక్ అధికారులు, సిబ్బంది రవీందర్, సాయికృష్ణ, నరేష్, శేఖర్, కృష్ణంరాజు, తదితరులున్నారు.

ప్రతిపాదనలిమ్మంటే తప్పించుకు తిరిగి ప్రజా సమస్యలపై మొసలికన్నీరా ?

● రాజకీయంగా లబ్ధి పొందేందుకే మున్సిపల్ చైర్మన్‌పై బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆరోపణలు ● కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రమేష్



ఖానాపూర్, సెప్టెంబరు 24 : తెలంగాణ ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ ద్వారా మంజూరు చేసిన నిధులను ఖర్చు చేసేందుకు వార్డుల వారీగా పనుల ప్రతిపాదనలు ఇమ్మంటే తప్పించుకు తిరిగిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు తాజాగా ప్రజా సమస్యలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్ ఎద్దేవా చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా కేవలం రాజకీయంగా లబ్ధి పొందేందుకు మాత్రమే బీఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. 12 వార్డులలో రూ. 40 లక్షల చొప్పున ఖర్చు చేయాలనే ఉద్దేశ్యంతో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ప్రతి వార్డు కౌన్సిలర్‌ను పనుల వివరాలు కోరారన్నారు. ప్రతిపాదనలు కోరినప్పుడు ఎన్నిసార్లు చేపట్టాల్సిన పనుల వివరాలు ఇమ్మని అడిగిన గాని అందించకుండా నిర్లక్ష్యం చేసిన ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధులు రావని మాకు అభివృద్ధి అవసరం లేదంటూ అవహేళనగా మాట్లాడారన్నారు. వారు స్పందించకపోయిన తనకున్న అవగాహన మేరకు ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులలో సైతం రూ. 10 లక్షలను అభివృద్ధి పనులకు కేటాయించారన్నారు. గత ఎనిమిది నెలల కాలంగా మున్సిపల్ చైర్మన్ సత్యం పాలన పరంగా ఎంతో చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. ప్రజలకు అవసరం ఉన్న ప్రతిచోట ప్రాతినిధ్యం వహిస్తున్నది స్వపక్షమా, విపక్షమా అనే తేడా లేకుండా బోర్లను వేయించడం, మోటార్లు బిగించడం, తాగునీటి సమస్యలతో పాటు పలు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారన్నారు. ఇవి చూసి ఓర్వలేక తమ రాజకీయ భవిష్యత్తు ఎక్కడ కోల్పోవాల్సి వస్తుందోనని ఇటువంటి జిమ్మిక్కులకు పాల్పడడం బీఆర్ఎస్ కౌన్సిలర్లకు తగదన్నారు. 11వ వార్డులో భారీ వరదల నేపథ్యంలో రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతిన్న నేపథ్యంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రత్యేక దృష్టి సారించి ఎక్కువ నష్టపోయిన వార్డు అయినందున 11వ వార్డుకు రూ.1.19 కోట్ల నిధులను కేటాయించారన్నారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పని చేయాల్సిన ప్రతిపక్ష కౌన్సిలర్లు రాజకీయ లబ్ధి కోసం చౌకబారు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా, పట్టణ నాయకులు పరిమి సురేష్, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు పోలంపల్లి సచిన్, తదితరులున్నారు.



● శిక్షణను ఇస్తున్న అధికారులు, హాజరైన కలెక్టర్



● శిక్షణకు హాజరైన మల్టీపర్పస్ వర్కర్లు



'భగీరథ' బాధ్యత.. పంచాయతీలదే

- మిషన్ భగీరథ పథకం అమలులో మార్పులు, చేర్పులు
- ఇకపై గ్రామ మంచినీటి సహాయకులుగా మల్టీపర్పస్ వర్కర్లు
- పంచాయతీ సిబ్బందికి నాలుగు అంశాల్లో ప్రత్యేక శిక్షణ
- నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- ఇప్పటికీ వందలాది గ్రామాలకు అందని ద్రాక్షగా మారిన భగీరథ జలాలు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 473 గ్రామ పంచాయతీలు ఉండగా.. వీటి పరిధిలో 1,272 గ్రామాలు

ఆదిలాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం అమలును మరింత పకడ్బందీగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించింది. ఇప్పటికే పథకం అమలులో కొన్ని మార్పులు, చేర్పులను చేపట్టేందుకు చర్యలను మొదలు పెట్టింది. ఇంటింటికీ శుద్ధ జలాన్ని అందించేందుకు గత ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించ లేదు. దీంతో ఈ పథకంపై ప్రారంభం నుంచి పలు రకాల విమర్శలు, ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికీ జిల్లాలో వందలాది గ్రామాలకు మిషన్ భగీరథ అందని ద్రాక్షగానే మారింది. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ.. క్షేత్ర స్థాయిలో అడుగడుగునా.. లోపాలే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ పథకాన్ని పర్యవేక్షించేందుకు సిబ్బంది కొరత తీవ్రంగా ఉండేది. దీంతో నెలల తరబడి సమస్య ల పరిష్కారానికి అవకాశం ఉండేది కాదు. ఇలాంటి పరిస్థితులతో పథకం అమలు ఓ అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. పలు రకాల సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేకదృష్టిని సారించింది. జిల్లాలో 473 గ్రామ పంచాయతీలు ఉండగా.. వీటి పరిధిలో 1,272 గ్రామాలు ఉన్నాయి. ఇందులో 1,238 గ్రామాలకు ఇప్పటి వరకు మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. మిగితా 34 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని సరఫరా చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నా రు. అయితే చాలా గ్రామాలకు సక్రమంగా మంచినీటి సరఫరా కాకపోవడంతో కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులను అధిగమించి సక్రమంగా మంచినీటిని సరఫరా చేసేందుకు మిషన్ భగీరథలో కొన్ని మార్పులు చేర్పులు చేస్తూ.. ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను మొదలు పెట్టింది.

> **నిరంతరంగా తాగునీటి సరఫరాకు చర్యలు**
>
> : కె.సురేష్, ఎస్ఈ, మిషన్ భగీరథ, ఆదిలాబాద్
>
> గతంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించి గ్రామాల్లో నిరంతరంగా మంచినీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగానే గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ముఖ్యంగా చేతిపంపులు, విద్యుత్ మోటార్ల మరమ్మతులు, క్లోరినేషన్, వాటర్ టెస్టింగ్, నల్ల కనెక్షన్ లాంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కరించి నీటి సరఫరాలో ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

మల్టీపర్పస్ వర్కర్లదే కీలకపాత్ర

ఇకపై గ్రామ పంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్లు కీలకంగా మారనున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీల్లో అన్నిరకాల విధులను నిర్వహించే విధంగా మల్టీపర్పస్ వర్కర్లను నియమించారు. గ్రామ పంచాయతీలలో 500 జనాభాకు ఒకరిని మల్టీపర్పస్ వర్కర్‌గా నియమించారు. దీంతో ఒక్కో గ్రామ పంచాయతీలో ఇద్దరు నుంచి ఎనిమిది మంది వరకు మల్టీపర్పస్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటు, హరితహారం, చెత్త సేకరణ, ట్రాక్టర్ డ్రైవింగ్ లాంటి పనులను మల్టీపర్పస్ వర్కర్లకు అప్పగించారు. ఇకపై గ్రామ మంచినీటి సరఫరా సహాయకులుగా వ్యవహరించనున్నారు. గ్రామస్థాయిలో నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యల ను ఎప్పటికప్పుడు పరిష్కరించి నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టనున్నారు. గతంలో గ్రామ పంచాయతీల పరిధిలోనే మంచినీటి సరఫరా జరిగేది. కానీ గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తూ.. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. అప్పటి నుంచి పంచాయతీలకు మంచినీటి సరఫరా బాధ్యతలు తప్పాయి. మళ్లీ సరఫరా బాధ్యతలను గ్రామ పంచాయతీలకే కేటాయిస్తూ పర్యవేక్షణ బాధ్యతలను మల్టీపర్పస్ వర్కర్లకు అప్పగించనున్నారు.

జిల్లాలో 480 మందికి శిక్షణ

గ్రామ స్థాయిలో సక్రమంగా మంచినీటిని సరఫరా చేసేందుకు మల్టీపర్పస్ వర్కర్లకు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 480 మంది సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 19వరకు మల్టీపర్పస్ వర్కర్లకు శిక్షణ పూర్తి చేయనున్నారు. ముఖ్యంగా విద్యుత్ మోటార్లు, చేతి పంపులు, పైపులైన్ లీకేజీలు మరమ్మతులు, వాటర్ టెస్టింగ్, మంచినీటి క్లోరినేషన్ లాంటి నాలుగు అంశాల పై సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండలాల వారీగా ఆయా గ్రామాలకు సంబంధించిన మల్టీపర్పస్ వర్కర్లకు శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేసి మంచినీటి సరఫరా బాధ్యతలను అప్పగించనున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీ నుంచి ఒకరు, మేజర్ గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరు ముగ్గురిని ఎంపిక చేసి శిక్షణ పూర్తి చేయనున్నారు. ఇకపై గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి అవకాశం ఉండడంతో నీటి సరఫరాకు ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే నిరంతర పర్యవేక్షణతో క్లోరినేషన్, వాటర్ టెస్టింగ్‌కు అవకాశం ఉంటుంది. దీంతో గ్రామీణ ప్రాంతాలలో శుద్ధనీటి సరఫరాకు ఇక డోకా లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ చాలా మంది మల్టీపర్పస్ వర్కర్లకు కనీస విద్యార్హత లేకపోవడంతో అధికారులు ఇచ్చే శిక్షణపై అంతంతమాత్రంగానే అవగాహన కనిపిస్తోంది. ముఖ్యంగా విద్యుత్ మోటార్ల మరమ్మతులు, విద్యుత్ త్రీఫేజ్, వన్‌ఫేజ్ సరఫరాలో కలిగే అంతరాయాలను అధిగమించేందుకు ఇబ్బందులు తప్పవంటున్నారు. క్లోరినేషన్, వాటర్ టెస్టింగ్, పైపులీకేజీల మరమ్మతులను ఎప్పటికప్పుడు చేపట్టే అవకాశం ఉంటుంది.

సంక్షిప్త సమాచారం

ఇచ్చోడ తహసీల్దార్‌గా సత్యనారాయణ

ఇచ్చోడ, సెప్టెంబరు, 24: ఇచ్చోడ మండల తహసీల్దార్‌గా సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల భీంపూర్ మండలంలో తహసీల్దార్‌గా ఉన్న ఆయనను ఇచ్చోడ తహసీల్దార్‌గా నియమించగా.. ఇక్కడ పనిచేస్తున్న తుకారాం సరికొండ మండలానికి బదిలీ అయ్యారు.

27న జిల్లా పోలీసు ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ పోటీలు

నార్నూర్, సెప్టెంబరు 24: జిల్లా పోలీసు ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ పోటీలు గుడిహత్నూర్‌లోని మోడల్ స్కూల్‌లో 27వ తేదీన పోటీలు ప్రారంభమవుతాయని సీఐ రహీంపాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఆదేశాల మేరకు పోటీలలో యువత జట్టుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోలీసులు, యువత సత్సంబంధాలు మెరుగు పరచాలని, యువత అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలనే సదుద్దేశంతో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్స్ ఎస్పీ ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.10,116, రెండో బహుమతి రూ.8116, మూడో బహుమతి రూ.5,116 ఉంటుంది. సభ్యత్వం ఉచితంగా ఉందని పేర్కొన్నారు. యువత పోటీలో పాల్గొనే వారు వారు ఇచ్చోడ సీఐ 8712659936 గుడిహత్నూర్ ఎస్సై 8712659946 నేరడిగొండ ఎస్సై 8712659947 సిరికొండ ఎస్సై 8712659948, నార్నూర్, గాదిగూడ ఎస్సైలను 26 తేదీ సాయంత్రం 6గంటల వరకు సంప్రదించాలని ఆయన పేర్కొనారు.

● 'యువత అన్ని రంగాల్లో రాణించాలి'

సిరికొండ రూరల్: పోలీసులు, యువత మధ్య సత్సంబంధాలు మెరుగుపర్చాలని, యువత అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే సదుద్దేశంతో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గుడిహత్నూర్‌లోని మోడల్ స్కూల్‌లో నిర్వహించడం జరుగుతుందని సీఐ నవీన్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిరు. సిరికొండ మండలంలోని ఆసక్తి ఉన్న యువత జట్టుగా ప్రతీఒక్కరు పాల్గొనాలని, వివరాలకు ఫోన్ నెం.8712659948 ద్వారా సంప్రదించాలని ఆయన సూచించారు.

29న జిల్లా స్థాయి చదరంగం ఎంపిక పోటీలు

ఆదిలాబాద్, సెప్టెంబరు 24: ఈనెల 29న జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ అండర్-15 బాల బాలికల జిల్లా స్థాయి చదరంగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరి నన్నపుస్వామి, కన్వీనర్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్‌లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఉదయం 10గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 1-1-2009 తర్వాత జన్మించిన బాల బాలికలు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, ఈ నెల 28 సాయంత్రం 5గంటల లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9848736476, 6281966588 సంప్రదించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 24: విద్యార్థి దశ నుంచే ప్రతీఒక్కరు రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలు వాటి పనితీరుపై అవగాహన పెంపొందించుకోవాలని, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సులో పలు అంశాలపై విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు. న్యాయపరమైన అంశాలు, డీఎల్ఎస్ఏ ద్వారా అందించే న్యాయసేవలు, చట్టాలు, హక్కులు, తదితర వాటిని వివరించారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాల మెరుగు

● ఆదిలాబాద్‌లో గిరిజన క్రీడోత్సవాలను ప్రారంభించిన ట్రైబల్ వెల్ఫేర్ ఏటీడీవో నిహారిక ● ఉట్నూర్‌లో ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్



ఆదిలాబాద్‌లో పోటీలను ప్రారంభిస్తున్న ఏటీడీవో నిహారిక



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 24: క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని, పోటీల్లో ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా కఠోర శ్రమతో రాణించాలని ట్రైబల్ వెల్ఫేర్ ఏటీడీవో నిహారిక అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ డివిజన్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. డివిజన్‌లోని ఆశ్రమ పాఠశాలకు చెందిన అండర్-14, 17 బాల బాలికలకు వేరు వేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్, చెస్ క్యారం అర్చరీ, టేన్నికైట్‌లో పోటీలు నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 27న ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించే జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారధి తెలిపారు. ఈ సందర్భంగా ఏటీడీవో నిహారిక మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థుల కోసం ప్రతియేటా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్, జోనల్, రాష్ట్ర స్థాయిల వివిధ క్రీడా అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. ఇటీవల కోలాం ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు హాకీ అకాడమికి ఎంపికయ్యారని తెలిపారు. క్రీడలతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతరావ్, క్రీడల ఇన్‌చార్జీ లక్ష్మణ్‌పవార్, గోపాల్, రవీందర్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు నారాయణరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● కొమురం భీం ప్రాంగణంలో క్రీడలు

ఉట్నూర్: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో డివిజన్ స్థాయి గిరిజన విద్యార్థుల క్రీడా పోటీలు ప్రారంభించామని గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జీ డీడీ జాదవ్ వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి క్రీడలు ప్రారంభించడం జరిగిందని ఏటీడీవో క్రాంతికుమార్ తెలిపారు. ఉట్నూర్ డివిజన్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు హాజరుకాగా ఇన్‌చార్జీ డీడీ జాదవ్ వసంత్‌రావు క్రీడా పోటీలను ప్రారంభించారని తెలిపారు. డివిజన్ స్థాయిలో విజేతలుగా నిలిచిన గిరిజన క్రీడాకారులను జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికచేసి పంపడం జరుగుతుందని అన్నారు. అథ్లెటిక్స్ పోటీలతో పాటు కబ్డీ, అర్చరీ తదితర పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు.



ఉట్నూర్‌లో కబడ్డీ ఆడుతున్న బాలికలు



గ్రామంలో వివరాలు సేకరిస్తున్న డాక్టర్ శ్రీధర్

సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను నిరంతరం పర్యవేక్షించాలి : జిల్లా మలేరియా అధికారి

నేరడిగొండ, సెప్టెంబరు 24: సికిల్ సెల్ వ్యాధిగ్రస్థులను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తేజపూర్ సబ్ సెంటర్ పరిధిలోని చించోలి గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి, సికిల్ సెల్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్‌పల్లివార్ సందర్శించారు. కాగా, గ్రామంలో సికెల్ సెల్ అనిమియా స్క్రీనింగ్ వివరాలను ఆయన పరిశీలించారు. గతేడాది డిసెంబరులో ఈ గ్రామంలో సికిల్ సెల్ స్క్రీనింగ్ పరీక్షలు 194మందికి నిర్వహించగా.. నలుగురికి సికిల్ సెల్ అనిమియా నిర్ధారణ అయ్యింది. 50 మందిని సికిల్ సెల్ క్యారియర్లుగా గుర్తించిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు వ్యాధిగ్రస్థులను నిరంతర పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించార. ఇందులో డాక్టర్ సదాం, హెచ్‌ఈవో పవర్ రవీందర్, ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, ఏఎన్‌ఎం రాణి, హెచ్‌ఏ సాయన,హెచ్‌ఏ శ్రీనివాస్, ఏఎస్‌హెచ్‌ఏ పాల్గొన్నారు.

ఎనిమల్ కేర్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 24: ఆదిలాబాద్ పట్టణంలోని ఎనిమల్ కేర్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంరక్షణ కేంద్రంలో కొనసాగుతున్న వీధి కుక్కల స్టెరైజేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎనిమిల్ కేర్ సెంటర్‌లో రోజువారి కార్యక్రమ వివరాలు, తదితర రికార్డులను రిజిష్టర్లను ఎప్పటికప్పుడు నవెదుచేయాలని, అదేవిధంగా ఎనిమల్ కేర్ సెంటర్‌ను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్‌కు సూచనలు చేశారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటిస్తూ వైద్య సేవలందించాలి

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 24: ప్రైవేట్ ఆస్పత్రుల్లో పూర్తి నిబంధనలు పాటిస్తూ వైద్య సేవలందించాలని క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ బాసర జోన్ ప్రత్యేకాధికారి డాక్టర్ జాన్ బాబు అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో మంగళవారం రెండో రోజు సైతం ప్రైవేట్ ఆస్పత్రుల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలు తీరుతో పాటు ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న బీఎస్ఆర్ పారామెడికల్ కళాశాలను తనిఖీ చేశారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 24: ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సౌరభం యాదవ్ తెలిపారు. మంగళవారం మండలంలోని పాటగూడ గ్రామంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. లక్సెట్టిపేట్‌లో జరిగిన అండర్-19 (55 కేజీ) విభాగంలో ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి రాథోడ్ పవన్, (50 కేజీ) విభాగంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థి రాథోడ్ సాయికిరణ్‌లు ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

ప్రతిఒక్కరూ మిషన్ భగీరథ నీరు తాగేలా అవగాహన కల్పించాలి : కలెక్టర్

ఆదిలాబాద్, సెప్టెంబరు 24: మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా పాల్గొని దిశా నిర్దేశం చేశారు. మిషన్ భగీరథ గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభం కాగా రెండవ రోజు జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికి సరఫరా చేస్తుందని, ప్రతీఒక్కరు మిషన్ భగీరథ నీరు తాగేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీ మల్టిపర్‌పస్ సిబ్బందికి అవగాహన కల్పించేందుకు 4రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. క్లోరినేషన్, టీడీఎస్, పీహెచ్ టెస్టులను ఎలా చేయాలో, చిన్న చిన్న మరమ్మతులు చేయడంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నెలలో మూడు సార్లు మొదటి రోజు, 11వ రోజు, 22వ రోజు ట్యాంకలను శుభ్రం చేసి క్లోరినేషన్ టెస్టులు చేసి వివరాలు నమోదు చేయాలన్నారు. కలుషిత నీరు తాగడం వలన అనారోగ్యంబారీనపడడం జరుగుతుందని గ్రామస్థులకు అవగా హన కల్పించాలని సూచించారు. శిక్షణను శ్రద్ధగా విని.. గ్రామాలలో అవగా హన కల్పించాలని కోరారు. ఇందులో మిషన్ భగీరథ ఎస్ఈ సురేష్, ఎంపీడీవో, తదితరులున్నారు.

జైనూర్ బాధితురాలికి పరామర్శ

ఉట్నూర్, సెప్టెంబరు 24: హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జైనూర్ బాధితురాలిని రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌లు సోమవారం రాత్రి ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి మహిళ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జైనూర్ బాధితురాలకి మెరుగైన వైద్యం అందజేస్తుందన్నారు. త్వరలో ప్లాస్టిక్ సర్జరీ చేయిస్తామని తెలిపారు. బాధితురాలికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి, న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. ఘటనకు కారకుడైన వ్యక్తిని జైలుకు పంపామని అతని పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాత్నాల ప్రాజెక్టు గేటు ఎత్తివేత

జైనథ్ రూరల్, సెప్టెంబరు 24: మండలంలోని మధ్య తరహా ప్రాజెక్టు అయిన సాత్నాలలో ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి భారీగా వరద నీరు ప్రాజెక్టులోకి చేరబడింది. దీంతో సాత్నాల ప్రాజెక్టు గల నాలుగు గేట్లలో సోమవారం అర్ధరాత్రి ఒక్క గేటును ఎత్తివేసి వరద నీటిని దిగువ ప్రాంతానికి అధికారులు వదిలి వేశారు. ప్రాజెక్టు గరిష్ఠ సామర్థ్యం 286.50 అడుగులు కాగా ప్రాజెక్టు సామర్థ్యం 1.24 టీఎంసీలుగా కాగా 1.159 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 300 క్యూ సెక్కులు కాగా ఔట్‌ఫ్లో 400 క్యూ సెక్కులుగా ఉంది.ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటి కప్పుడు సాత్నాల ప్రాజెక్టు డీఎంసీ శ్రీనివాస్‌రావు, ఏఈ పి మారుతిలు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.